# రసికరాజ తగువారము కామా?

ఆంధ్రభోజుడన్న పేరిట శ్రీకృష్ణదేవరాయులు ప్రస్తుతించబడుటకు కారణము భోజుడాతడి కంటే ముందు పుట్టుటయే! అతడు భోజు ననుసరించవలెనని సాహిత్య సేవకు పాల్పడలేదు. పరిమళించుట పూవునకు సహజము. సాహిత్యాభిమానము కృష్ణరాయలకు సహజము.

ఒకరోజున ఐరావతమును మించిన గజరాజు నధిరోహించి కృష్ణరాయలు నగర విహారమునకు బయలుదేరినాడు. అప్పుడాతడు ధరియించిన ఆభరణములను మించిన ముఖ తేజస్సుతో ప్రకాశించు సూర్యునివలె ఉన్నాడు. నగర మధ్యమున ఉన్నను అతడి ప్రకాశము శక్తి నొసగుటకేకాని తాపమును కలిగించుటకు కాదు. అతడి దివ్యతేజము శత్రురాజులకు మాత్రమే దుర్నిరీక్ష్యము. ప్రజలకతడిది ప్రశాంత వదనము.

విజయనగరములోని అణువణువును తన ప్రాణమునకు మిన్నగా ప్రేమించు కృష్ణభూపతి నగర విహారమునకు రయమున పోవు హయములను కాక మందగమనయగు మత్తేభముయ నెన్నుకొనినాడు. తన పాలనలో క్షణక్షణాభివృద్ధి గాంచుచున్న యా నగర విశేషములను జూచుచు పరవశుడగుచు నాతడు తన పయనమును కొనసాగించినాడు.

ఆ సమయమున అష్టదిగ్గజములందు ప్రప్రథముడైన అల్లసాని పెద్దన కవి సుదూరమున అతడి కంటబడినాడు. రాజు వెంటనే నగర విలోకన పారవశ్యము నుండి బయటపడి మావటి చేత ఏనుగునాపించి తను క్రిందకు దిగినాడు.

అప్పటికి కవివర్యుడచటికి చేరుకొని తానును ఆగినాడు.

కృష్ణరాయలు ప్రసన్న వదనంతో పెద్దనను చూసి.."కవివర్యా! నేనిటుల నగర మధ్యంబున ఆగుట తమకాశ్చర్యముగ నున్నదా?" అన్నాడు.

"ఇందాశ్చర్యమేమున్నది? నేనెదురు పడితిని. తమరు మద కరీంద్రము డిగ్గితిరి. ఇది నాకు కొత్త కాదు గదా!" అనినాడు పెద్దన.

పెద్దన చేతిలోని తాళ పత్రములనప్పుడు చూసినాడు కృష్ణరాయలు.."తమ చేతిలో నేదియో ఉద్గ్రంథమున్నట్లున్నదే"

"ఉద్గ్రంధమని మీరనవలయును. హితుడవు, చతుర వచోనిధివి, అతులపురాణా గమేతిహాస కథార్థస్మృతి యుతుడవు, ఆంధ్రకవితా పితామహుడవు అని తమరు నన్ను ప్రస్తుతించి... మనువులలో స్వారోచిష మనుసంభవము భవచ్చతుర రచనకనుకూలంబు కావున మార్కండేయ పురాణోక్త ప్రకారంబున జెప్పుమని కర్పూరతాంబూలంబు పెట్టినంబట్టి

మహాప్రసాదంబని మోదంబున ప్రారంభించిన నమ్మహాప్రబంధ నిబంధ నంబిందున్నది..' ' అని పెద్దన వినయ పూర్వకముగా తెలియజేసినాడు.

"అటులనా? ఆయన నిప్పుడు మీ పయనమెచ్చటకు?"

"గ్రంథ రచన పరిసమాప్తి కాగా, రస హృదయునకది వినిపింపవలెనని మనసు తొందరపెట్టగా ఉన్న పళమున తమ దర్శనార్థము బయలుదేరినాడను ప్రభూ!" అనినాడు పెద్దన.

వెనువెంటనే కృష్ణరాయలు గంభీర వదనుడై.."కవితాపితామహా! తమరు నన్ను మన్నించవలెను. నేనిపుడు నగర విహారమున నున్నాను. రసపిపాసకిది తరుణము కాదు. నేను తమకు కబురుపంపెదను. అంతవరకును వేచి యుండుడు.." అని వెనువెంటనే గజాధి, రోహణము కావించి అచటి నుండి కదలినాడు.

రసపిపాసియగు రాజు తనకు కేలూతనొసగి ఎక్కించుకొనుననియు, కావ్య శ్రవణాభిలాషతో తహతహలాడుననియు భావించిన పెద్దనామాత్యునకు ఆశాభంగము, అవమానము ఒకే పర్యాయము కలిగినవి.

"కృష్ణరాయలి సాహిత్యాభిమానమొక నాటకమా? భోజుడు కాళిదాసు ముందు రాజసమును ప్రదర్శించిన సందర్భమొక్కటేనియు గలదా? ఆంధ్రభోజుడన్న నాతడు భోజుడగునా? ప్రబంధ కావ్యమును రచించి, తానడగకనే వినిపించవలెననుకొన్న కవి హృదయమును గుర్తించనేరని ప్రభువు సాహితీ పోషకుడెట్లగును? అట్టి అనర్హునకు నేను కావ్యము నంకితము సేయవచ్చునా? ఇప్పటికే గ్రంథమున నాతని కృతిపతిగా ప్రశంసించితినే. ఇపుడేమి చేయవలయును?" అని పరిపరి విధముల నాలోచించుచు ఆ మహాకవి యిల్లు చేరినాడు.

అప్పటికిని ప్రభువు తిరస్కారమాతడి మనసు నుండి తొలగకున్నది. కవులు భోగభాగ్యములు కోరరు. సన్మాన సత్కారములు కాంక్షించరు. వారు కోరునది కావ్యారంభమునకు ప్రోత్సాహము, కావ్యానంతరము అనుభూతిని పంచుకొనుటకు రసహృదయము.

రాయలితో పెద్దన అనుబంధము ఒకనాటిదికాదు. ఒక ఏటిది కాదు. అందువలన అతడి కాగ్రహించుకుందమనినను ఆవేశము బుట్టుట లేదు. తన ప్రబంధకావ్యము వరూధినియై.."*ఎక్కడివాడొ యక్ష తనయేందు జయంత వసంత కంతులన్ జక్కదనంబునన్ గెలువ జాలెడు వాడు. నను వీడు గ్రహించునా?*" అని కృష్ణరాయలను జూసి వాపోవుచున్న భావన కలుగసాగినది.

వరూధిని మాయా ప్రవరాఖ్యుని ఆశ్రయించినది. తన కావ్యమునకు తానును కృష్ణరాయలకు సాటిరాని వేరొక ప్రభువును కృతిపతిగా వెదకి తేవలయునా?

ఆ రోజంతయు పెద్దనామాత్యుడు రమణీప్రియదూతిక తెచ్చి ఇచ్చు కప్పురబు విడెంబును స్వీకరింపక, బంగరు తూగుటుయ్యేలలో బవళింపక విషాద మనస్కుడై

అంతరంగమున. "రసికరాజ తగువారము కామా?" అని విలపించినాడు - తనను, తన కావ్యమును కలుపుకుని!

ఆ రోజు గడిచింది.

మరుసటి దినమున బాల భానుని తొలి కిరణములు భూదేవిని స్పృశించు సమయమున నొక చెలియ పెద్దనామాత్యునకు మేలుకొలుపు పాడుచూ.."ఆర్యా, ప్రభువులు తమ కొరకు మేనాను పంపినారు" అన్నది.

కవివర్యుడప్పుడు కలత నిద్ర నుండి ఉలిక్కిపడి.."ఏమంటివి?" అనినాడు. అతడి అనుమతిపై చెలియ రాజభటుని పెద్దన ముందు ప్రవేశ పెట్టినది. భటుడాతడికి కృష్ణరాయలి సందేశము వినిపించినాడు.

"భానుడుదయించినను. మా మనోపద్మమింకను ముకుళితమై యున్నది. తమకు, స్వారోచిష మనుసంభవమునకు మేనాను పంపినాను.వేగమె విచ్చేపి మాకు మనో వికాసమును కలిగించ ప్రార్థన."

అభ్యంతరము తెలుపవలెనని పెద్దనకు అనిపించినది. కానీ తన నిరసనను భటునకేల తెలుపవలెను? తిరస్కారమునకు ప్రతి తిరస్కారమే మందు - ఫలితమేమైన కానిమ్ము!

పెద్దనామాత్యుడు తీరుబడిగా కాలకృత్యములను తీర్చుకొనినాడు. రాయలి సందేశమాతడికి కొంత ఉపశమనము కలిగించినది. ప్రభువు తనతప్పును గ్రహించి ఈ రోజు మేనా పంపినాడు. అంతమాత్రమున ఒక రోజు అంతయు తాననుభవించిన వ్యధ మాసిపోవునా?

కవితాపితామహుడు పట్టు వస్త్రములను ధరించి, తాళ పత్రములను చేతబూని తన ఇంటి ముందట నిలచిన మేనా ఎక్కినాడు. ఇరువురు బోయీలు మేనా నెత్తినారు. అందు పెద్దన కృష్ణరాయలి కొలువు జేరినాడు. అతడికక్కడ ఘనస్వాగతము లభించినది. భువనవిజేత కృష్ణ రాయలకు సహితము అట్టి గౌరవము లభించియుండలేదు. అయిననూ ప్రభువు తనకు స్వయముగా స్వాగతము పలుకలేదని పెద్దన మనసున చిన్నబుచ్చుకొనినాడు. అతడు సగౌరవముగా కొలువున ప్రవేశించి ఉన్న తాసనాధిరోహుడైన కొలదిసేపటికి కృష్ణరాయలు సభా ప్రవేశము చేసి కావ్య పఠనము గావించుమని కవితాపితామహుని కోరినాడు.

పెద్దనామాత్యుడు తాళపత్రములను సవరించుకొని ప్రభువు తిరస్కారమునకు బదులిచ్చుటకిదియే తగిన సమయమని భావించినాడు.

కొలువున చేరిన రసిక శిఖామణులు అల్లసాని వారి అల్లిక జిగిబిగి అనుభూతులకై ఆత్రపడుచున్నారు.

పెద్దన మనస్సు ద్వైదీభావముతో ఊగిసలాడుచున్నది. అతడు తన గ్రంథము వంక దృష్టి సారించినాడు. కావ్యము ఇష్టదేవతా వందనముతో ప్రారంభమైనది. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కృష్ణరాయనికి మేలు చేయవలెనని యున్న ఆ పద్యములను చదువుటకు

మనసొప్పక..“ప్రభూ! ఈ దినము నా మనసు మనసులో లేదు. కావ్యపఠనము అన్యులచే గావింపుడు..” అనినాడు పెద్దన.

కృష్ణరాయలు మందహాసము చేసి..“తెలుగున వెలసిన తొలి స్వతంత్ర రచనకు కర్తలు తమరు. తమ కావ్యానికి గజారోహణమునకు మించిన మేనాను మనసున నిర్ణయించుకొనుటచే ఇప్పటికే కావ్యశ్రవణమునకు ఒక రోజు జాప్యమైనది. ఇక జాప్యమును భరింపజాలము. తమరే కావ్యపఠనము కావించవలయును..” అనినాడు.

నిన్నటి తన ప్రవర్తనకిది కుంటిసాకు అని పెద్దన భావించి.. “ప్రభూ! గజారోహణమును మేనా ఎందుకు మించినదో నా కర్ధము కాలేదు. అది నిజమైనను తమరావిషయమును నిన్నటి దినమున నాకేల చెప్పియుండలేదు?” అనినాడు.

కృష్ణరాయలు తిరిగి మందహాసము చేసి “దేశభాషలందు లెస్సగా భావించబడు తెలుగున వెలసిన తొలి స్వతంత్ర కావ్యమునకు మేము స్వయముగా పల్లకి నెత్తకున్న మా సాహిత్య సేవకు సార్ధకత ఎట్లు లభించును? గజారోహణమున మేము స్వయముగా చేయగల సేవ ఏమున్నది? అదువలన సాహిత్య సేవకు మేనా ఒక సంప్రదాయము. తమరు కూర్చున్న మేనాకు మేము బోయీల మగుట ముందుగా తెలిసిన తమ రంగీకరించరని ఆ విషయము గోప్యముగా ఉంచితిమి!” అనినాడు.

పెద్దన నివ్వెరబోయి...“ప్రభూ! తమరు నా పల్లకి నెత్తినారా! ఇది నిజమా?” అనినాడు.

“అవును.. అందులకే మేము కొలువునకు తమను స్వయమగా ఆహ్వానించలేకపోతిమి. సాహితీ పరులను, సాహిత్యమును మేము గౌర వించు విధానమిదియే! ఇది తరతరముల యుగ యుగముల సంప్రదాయము కాగలదు. కావున కవివర్యా! కావ్య పఠనము మీరే కావించవలెను. ఇప్పుడు మీ మనసు మనసున లేకున్న మీ మనసు మనసును చేరువర్కు మేమిచటనే ఎదురుచూచుచుండెదము” అనినాడు ఆంధ్ర భోజుడు.

ఏదో అనవలెనని పెద్దన పెదవులు కదిపినాడు.

*శ్రీ వక్షోజ కురంగనాభ మెదపై జెన్నొంద విశ్వంభరా*

*దేవిందత్కమలా సమీపమున బ్రీతిన్నిల్పినాదోయనం*

*గావందారు సనందనాది నిజభక్త శ్రేణికిందోచురా*

*జీవాక్షుండు గృతార్థుజేయు శుభదృష్టిం గృష్ణరాయధిపున్*

అప్రయత్నముగా ఆ కవి నోట పలికినది ఇష్టదేవతావందనము. అదే కావ్య పఠనారంభము.

పెద్దన తాళపత్రములను జూచుటలేదు. కావ్యమాతతడినోట పలుకుచున్నది. అతడి కనుల ముందు మాత్రము తనకు పల్లకి నెత్తిన రసికరాజు ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు కదలాడుతున్నాడు. ★

*(జ్యోతి మాసపత్రిక -- జూన్ 1985)*